సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 12, అక్టోబర్, 2022

మళ్లీ ఉప్పొంగిన వట్టికాలువ



కొయ్యూరు: మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. కాకరపాడు–కొయ్యూరు మధ్య ఉన్న వట్టికాలువ ఉప్పొంగి ప్రవహించడంతో మూడు గంటలపాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నర్సీపట్నం డిపోకు చెందిన రెండు బస్సులు,ఏలేశ్వరానికి చెందిన బస్సు, స్కూల్ బస్సులు, ఆటోలు నిలిచిపోయాయి. గత 20 రోజుల్లో ఈ కాలువ ఉధృతంగా ప్రవహించడం ఇది మూడోసారి. సింగవరం ఏపీజీవీ బ్యాంకు సమీపంలో పిడుగు పడడంతో పలువురి ఇళ్లలో విద్యుత్ గృహోపకరణాలు పాడైపోయాయి.

బెంగళూరు–విశాఖ మధ్య స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు నుంచి విశాఖకు ఒక ట్రిప్ స్పెషల్ రైలు నడిపేందుకు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. బెంగళూరు–విశాఖపట్నం(06587)స్పెషల్ ఈనెల 15న మధ్యాహ్నం 3.50 గంటలకు బయల్దేరి, మరుసటిరోజు మధ్యాహ్నం 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేలా కృషి

- డీఈవో రమేష్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

పెదబయలు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ పి.రమేష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా బోధించాలని చెప్పారు. మంచి ఆలోచనలు వచ్చే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని తెలిపారు. వారి ఆలోచన విధానమే వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.నాగేశ్వరరావు,శిక్షణ అధికారులు ప్రసాదరావు,విజయకుమారి, మోదలక్ష్మి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్ డియో

అడ్డతీగల: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్‌డియో అన్నారు. అడ్డతీగల ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులతో బాధ్యత గల పౌరులుగా మారాలన్నారు. హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన సమాజ స్థాపనకు బాటలువేయాలని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వివరించారు. న్యాయవాదులు రమణ,శ్రీధర్ తదితరులు న్యాయపరమైన అంశాలను తెలియజేశారు.

ఘనంగా మత్స్యమాడుగులమ్మ పండగ



నాటు తుపాకీ, ఖడ్గాన్ని ఊరేగింపుగా తీసుకువెళుతున్న మత్స్యరాస వంశీయులు

జి.మాడుగుల: మత్స్యరాస వంశీయుల ఇలవేల్పు మత్స్యమాడుగులమ్మ పండగను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం దసరా అనంతరం వచ్చే మొదటి మంగళవారం గిరిజన సంప్రదాయం ప్రకారం 'గిరిజన దసరా' పండగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ ప్రాంతంలో ముఠాదారీ వ్యవస్థ ఉన్న కాలం నుంచి మత్స్యరాస వంశీయులు మత్స్యమాడుగులమ్మను ఆరాధిస్తున్నారు. ఉత్సవం సందర్భంగా మాజీ ఎంపీ దివంగత మత్స్యరాస మత్స్యరాజు స్వగృహం నుంచి మత్స్యరాస వంశీయులు మత్స్యరాస వరహాలరాజు, రామరాజు, నాగరాజు తదితరులు పూర్వీకులు వినియోగించిన ఖడ్గం, నాటు తుపాకీలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గంతకొండపై కొలువై ఉన్న మత్స్యమాడుగులమ్మ అమ్మవారి సన్నిధికి చేర్చారు. గిరిజన పూజారి శివందొర పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మత్స్యమాడుగులమ్మను దర్శించుకున్నా రు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి,మాజీఎంపీపీ ఎం.వెంకటగంగరాజు, జిల్లా గిరిజన ఉపాధ్యాయుల సంఘం నాయకుడు బాణం శ్రీనివాసుదొర పాల్గొన్నారు.

18న విజయవాడలో మెగా జాబ్‌మేళా

సాక్షి, పాడేరు : కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు విజయవాడలోని ఎస్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టబ్బాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేరొందిన 10 కంపెనీల్లో నియామకాల కోసం లాజిస్టిక్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ అండ్ లాజిస్టిక్ ఎల్ఎస్‌సీ వారి ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తయిన విద్యార్థుల కోసం ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 2021–22 విద్యాసంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జెరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, ఫొటోలతో హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441142001 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఆశలు తీరేలా..

- ఖరీఫ్‌లో భేషుగ్గా వరి సాగు
- కలిసొచ్చిన వాతావరణం
- జిల్లాలో 50,723 హెక్టార్లలో వరినాట్లు



హుకుంపేట మండలం కొంతిలిలో గింజ దశలో వరిపంట

సాక్షి, పాడేరు : ముంపు మండలాలు మినహా జిల్లాలోని మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్‌లో వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు, అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సకాలంలో వర్షాలు కురవడం,వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో ముందుగా నాట్లు పూర్తిచేసిన భూముల్లో వరి గింజ దశతో కళకళాడుతోంది. పాడేరు,హుకుంపేట, జి.మాడుగుల,పెదబయలు, అరకులోయ తదితర ప్రాంతాల్లో పంట గింజదశకు చేరుకుంది. వరినాట్లు ఆలస్యమైన భూముల్లో కూడా పంట ఎదుగుదల బాగుంది. తొలకరి వర్షాలు ఏప్రిల్ నుంచే జిల్లాను పలకరించడంతో రైతులు ఖరీఫ్ పనులను ప్రారంభించారు.

ఏప్రిల్, మే, జూన్, జులై నెలల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద వ్యవసాయ పెట్టుబడికి ఆర్థిక సాయం అందజేయడంతో పాటు వ్యవసాయశాఖ ద్వారా 90శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను ముందుగానే పంపిణీ చేయడం రైతులకు మేలు చేసింది.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం 59,189 హెక్టార్లు కాగా, ఈఏడాది 50,723 హెక్టార్లలో నాట్లు వేసినట్టు ఈ–క్రాప్ నమోదులో తేలింది. ముంపు మండలాల్లో వరినాట్లు పడకపోవడంతో విస్తీర్ణం తగ్గినట్టు అధికారులు తెలిపారు. వరదల కారణంగా చింతూరు ఐటీడీఏ పరిధిలోని ఎటపాక, కూనవరం, చింతూరు, వి.ఆర్.పురం, దేవీపట్నం మండలాల్లో లోతట్టు భూములు ముంపునకు గురయ్యాయి. దీంతో అక్కడ వరి సాగుకు ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని చోట్ల ఆలస్యంగానైనా నాట్లు వేశారు.ఆయా భూముల్లో కూడా పంట ఆశాజనకంగానే ఉంది.

దిగుబడి పెరుగుతుంది

వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఖరీఫ్‌లో వరిసాగు ఆశాజనంగా ఉంది. విస్తారంగా వర్షాలు కురవడంతో వేసవి దుక్కులు బాగా జరిగాయి. ముందస్తుగా నాట్లు వేసిన చోట పంట గింజ దశకు చేరుకుంది. ఈఏడాది వరి దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– ఎస్.బి.ఎస్ నందు, జిల్లా వ్యవసాయ అధికారి, అల్లూరి సీతారామరాజు జిల్లా

గంజాయి స్మగ్లర్ల ఉచ్చులో పడొద్దు

- ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్

సీలేరు: గంజాయి స్మగ్లర్ల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చింతపల్లి ఏఎస్పీ కొమ్ము ప్రతాప్ శివ కిషోర్ గిరిజనులకు సూచించారు. ఆంధ్రా,ఒడిశా సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. సీలేరు పోలీసు స్టేషన్ పరిధిలో వలసగడ్డ, బూసికొండ, పార్వతీనగర్ గ్రామస్తులతో మాట్లాడారు. గంజాయి, సారా వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. గిరిజనులు గంజాయి కేసుల్లో చిక్కుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చెప్పారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ కల్పిస్తున్న ఉద్యోగ,ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.అనంతరం గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి సీఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర రీ సర్వేతో భూ వివాదాల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్రంలో జేసీ, సబ్ కలెక్టర్, డీఆర్‌వో తదితరులు

- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న భూముల రీ సర్వేతో వివాదాలు పరిష్కారమవుతాయని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. భూముల రీ సర్వేపై పాడేరు డివిజన్‌లోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వేను పర్యవేక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి వివాదాలకు తావు లేకుండా సర్వే చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన వెంటనే జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద శాశ్వత పట్టాలను రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో హక్కులు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని, సర్వే బృందాలు, రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్తులు, రైతుల సహకారంతో రీ సర్వే చేపట్టాలని చెప్పారు.

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ గ్రామంలో శతశాతం భూముల రీ సర్వే పూర్తి చేయాలన్నారు. సివిల్ వివాదాలు ఉన్నచోట భూముల మ్యుటేషన్ చేయవద్దని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ మాట్లాడుతూ 2,969 గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డీఆర్‌వో బి.దయానిధి, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, సర్వే ఏడీ మోహన్‌రావు, సర్వే ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విరగ్గాసిన కాఫీ.. మురిసేలా మిరియం

- పండ్లతో తోటలు కళకళ
- అనుకూలించిన వాతావరణం
- గిరి రైతుల మోములో ఆనందం



మినుములూరు ప్రాంతంలో విరగ్గాసిన మిరియాలు



పండ్ల దశకు వచ్చిన కాఫీ పంట

సాక్షి,పాడేరు : గిరిజనుల సాగులో ఉన్న కాఫీ తోటల్లో ఈ ఏడాది కాపు అధికంగా ఉంది. విరగ్గాసిన కాయలతో పాడేరు డివిజన్‌లో తోటలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ముందస్తుగానే పక్వానికి వస్తున్నాయి. ఇప్పుడిప్పుడే పండ్ల దశకు చేరుకుంటున్నాయి. కాపు ఆశాజనకంగా ఉందని, దిగుబడులు బాగుంటాయని గిరిజన రైతులు ఆనందంగా చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఐటీడీఏ కాఫీ విభాగం గత 20ఏళ్ల నుంచి కాఫీ సాగును ప్రోత్సహిస్తోంది. పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లో సుమారు 2,10,000 ఎకరాల్లో కాఫీ తోటలుండగా 1,50,000 ఎకరాల విస్తీర్ణంలో గల కాఫీ తోటలు ఫలాసాయాన్ని ఇస్తున్నాయి. మే నెల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలు కాఫీ పంటకు ఎంతో మేలు చేశాయి. గత ఏడాది ఏడు వేల టన్నుల వరకు దిగుబడి రాగా, ఈ ఏడాది దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు కేంద్ర కాఫీ బోర్డు అధికారులు చెబుతున్నారు.

ఆశాజనకంగా మిరియాల కాపు

కాఫీ తోటల్లో గిరిజన రైతులు అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల కాపు కూడా ఆశాజనకంగానే ఉంది. ముందుగానే కాపు వచ్చింది. సుమారు లక్ష ఎకరాల కాఫీ తోటల్లో అంతర పంటగా మిరియాలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. కాఫీ తోటకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ వృక్షాలకు మిరియాల పాదులను ఎక్కించి అంతర్ పంటగా సాగు చేస్తున్నారు. ప్రతీ చెట్టుకు ఉన్న మిరియాల పాదుల ద్వారా కనీసం 10 కిలోల ఎండు మిరియాల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది మిరియాల దిగుబడులు కూడా అధికంగానే ఉంటుందని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాఫీ, మిరియాల పంటకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాఫీ రైతులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన



ల్యాబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ఏయూ కేంద్రంగా 'డిజిఫాక్'సేవలు
- లో కోడ్ టెక్నాలజీలో విద్యార్థులను నిపుణులుగా తీర్చిదిద్దుతున్న సంస్థ

ఏయూక్యాంపస్: ఏ బ్రాంచ్ విద్యార్థి అయినా సాఫ్ట్‌వేర్ రంగంలో నిలదొక్కుకుని.. ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలి. ఇదే లక్ష్యంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం కేంద్రంగా ఏయూ పూర్వ విద్యార్థి పి.అమల్‌రాజ్ స్థాపించిన ది డిజిఫాక్ సంస్థ పని చేస్తోంది. ఇక్కడ విద్యార్థులకు మూడు నుంచి ఆరు నెలల కాలం పాటు శిక్షణ అందించి.. అనంతరం ఉపాధి కల్పిస్తోంది. ప్రారంభ వేతనంగా ఏడాదికి రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందిస్తుండటం విశేషం.

వీసీ ఆలోచన.. పూర్వ విద్యార్థి ఆచరణ

ఉపాధి కల్పన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆలోచనలకు అనుగుణంగా డిజిఫాక్ సంస్థ ఏర్పాటైంది. అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేసిన ఏయూ పూర్వ విద్యార్థి అమల్‌రాజ్ తాను వర్సిటీకి ఏదైనా చేయాలని ఉంది అనే ఆలోచనను వీసీ వద్ద వెలిబుచ్చారు. దీనికి కార్యరూపంలో తీసుకువస్తూ ఏయూతో పాటు ఉత్తరాంధ్రలోని ఇంజినీరింగ్ కోర్సులు చదివి ఉపాధి కోసం వెతుకుతున్న ప్రతి విద్యార్థికి ఉపయుక్తంగా ఈ కేంద్రాన్ని స్థాపించారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం పక్కనే ఉన్న ఓ భవనాన్ని వర్సిటీ అధికారులు వీరికి కేటాయించారు. భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు వంటివి అమల్‌రాజ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తూ.. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.



ఏయూలో డిజిఫాక్ సంస్థ కార్యాలయం

వర్క్‌ఫ్రం హోం సదుపాయం

కేవలం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకే కాకుండా మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ విభాగాల విద్యార్థులు సైతం సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించే విధంగా ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు. బి.టెక్ పూర్తయిన వారికి మూడు నెలల పూర్తి కాలం శిక్షణ అందిస్తున్నారు. బి.టెక్ మూడవ, నాల్గో సంవత్సరం విద్యార్థులకు ఆరు నెలల పాటు వారంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ప్రాథమిక సూత్రాల నుంచి హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావా స్క్రిప్ట్, డేటాబేస్, ఎస్‌క్యూఎల్, లో కోడ్–ఔట్ సిస్టమ్స్ తదితర కోర్సులు అందిస్తున్నారు. వీటిని పూర్తి చేసిన వారికి డిజిఫాక్ సంస్థ ఉపాధి అందిస్తోంది. శిక్షణ పూర్తిచేసుకుని ఉపాధిని పొందిన విద్యార్థులు కోరితే వర్క్ ఫ్రం హోం అవకాశాన్ని సంస్థ కల్పిస్తోంది. ఎక్కడ నుంచైనా వారు పనిచేసే అవకాశం ఉంది.

లో కోడ్‌డే భవిష్యత్తు

భవిష్యత్ తరానికి ఉపయుక్తంగా నిలిచే రంగంలో విద్యార్థులను తీర్చిదిద్దడం ఎంతో అవసరం . అందుకే అవుట్ సిస్టమ్స్ సర్టిఫైడ్ ట్రైనర్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విశాఖతో పాటు పుణెలో ఉన్న నిపుణులు వీరికి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ కెరీర్‌ను ఉన్నతంగా మలచుకోవడానికి, భవిష్యత్‌లో ఈ రంగంలో రాణించడానికి లో కోడ్ ఒక సాధనంగా నిలుస్తుంది. ఇక్కడ అవుట్ సిస్టమ్స్ సర్టిఫికేషన్ కోసం ప్రత్యేకంగా ప్రో మెట్రిక్ టెస్ట్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు.

మీ లక్ష్యం ఏమిటి?

ఇంజినీరింగ్‌లో చేరిన ప్రతీ విద్యార్థి ద్వితీయ సంవత్సరం నుంచి తన భవిష్యత్ ఏమిటని ప్రశ్నించుకోవాలి. తదనుగుణంగా తాను వెళ్లే రంగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి.

ప్రస్తుతం విద్యార్థుల్లో అధికశాతం మందికి ఈ అవగాహన కొరవడుతోంది. డిజైనర్, డెవలపర్, టెస్టర్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్ విభాగాల్లో యువత అవసరం ఉంది. దీనికి అనుగుణంగా తాను ఏ రంగంలో రాణించాలో నిర్ణయించుకుని దానికి అనుగుణంగా అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి.

ఆసక్తి ప్రధానం



సాఫ్ట్‌వేర్ రంగంలో దీర్ఘకాలం నిలదొక్కుకోవాలంటే విభిన్న నైపుణ్యాలు, సామర్థ్యాలు కలిగి ఉండటం ఎంతో అవసరం. ముందుగా విద్యార్థిలో ఆసక్తి, కష్టపడి నేర్చుకునే తత్వం ఉండాలి. కొద్దిపాటి గణిత పరిజ్ఞానం, అనలిటికల్ స్కిల్స్ ఉన్న వారు సులభంగా నేర్చుకోగలరు. త్వరలో ఎమ్మెస్సీ విద్యార్థులకు లో కోడ్‌లో శిక్షణ అందించే ప్రతిపాదన ఉంది. ఆసక్తి కలిగిన ఏ కళాశాల విద్యార్థి అయినా నేరుగా కార్యాలయానికి రావచ్చు.

– అమల్‌రాజ్, వ్యవస్థాపకుడు, ది డిజిఫాక్

ఆసక్తి ఉన్న వారికి అవకాశం



ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగం కోసం వెతుకుతున్న సమయంలో ఈ సంస్థ గురించి తెలిసింది. ఇక్కడ శిక్షణ అందించి ఏడాదికి నాలుగు లక్షల వేతనంతో డెవలపర్‌గా ఉద్యోగం కల్పించారు. కంప్యూటర్ సైన్స్ కాకుండా కోర్ బ్రాంచ్‌లో ఇంజినీరింగ్ చేసిన వారికి కూడా శిక్షణ అందించి, ఉద్యోగాలు ఇస్తున్నారు. ఏయూ చేపట్టిన ఈ కార్యక్రమం చాలా బాగుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఇ.హారిక, డెవలపర్, ది డిజిఫాక్

ఉచితంగా శిక్షణ



ఏయూలో ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ పూర్తి చేశాం. ఏయూ అధికారులు డిజిఫాక్‌కు వెళ్లమని సూచించారు. ఇక్కడ విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఉచితంగా అందిస్తున్నారు. మా లాంటి విదేశీ విద్యార్థులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఉద్యోగం కూడా కల్పిస్తున్నారు. ఏయూ విద్యార్థులకు ఇది మంచి అవకాశం.

– మహ్మద్ షరీఫ్, అహ్మద్ షరీఫ్, ఆఫ్గనిస్తాన్ విద్యార్థులు

ఫార్మా ఎగ్జిబిషన్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పైడా సంస్థల అధినేత కృష్ణప్రసాద్

పరవాడ(పెందుర్తి): ఫార్మా పరిశ్రమలు నెలకొల్పే ఆలోచన ఉన్న పారిశ్రామికవేత్తలకు ఇక్కడ ఏర్పాటు చేసిన ఆంపెక్ట్ ఇండియా ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో ఉపయుక్తంగా నిలుస్తుందని విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్ అన్నారు. పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మెటిగేషన్ మంగళవారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయి, ఢిల్లీ నగరాలకే పరిమితమైన ఫార్మా ఎగ్జిబిషన్‌ను విశాఖ ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన సొసైటీ ప్రతినిధులను అభినందించారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన అధునాతన పరికరాలపై పారిశ్రామికవేత్తలు, ఫార్మా ఉద్యోగులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎంఏఎస్ఆర్‌ఎం అధ్యక్షుడు జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ ఇక్కడ ఎగ్జిబిషన్‌లో 126 సంస్థలు పాల్గొని.. వారు తయారు చేసిన అధునాతన పరికరాలు ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా ఫార్మాసిటీలోని 92 పరిశ్రమలకు చెందిన 40 వేల మంది కార్మికులు జ్ఞానాన్ని పెంచుకునేందుకు వీలవుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంఏఎస్ఆర్‌ఎం కార్యదర్శి శివరామప్రసాద్, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన ప్రాంత అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలి

- ఎంపీ మాధవి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాధవి

కొయ్యూరు: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి జాతీయ షెడ్యూల్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ)ప్రత్యేక చర్యలు చేపట్టాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. మరిన్ని నిధులు కేటాయించి గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన జాతీయ షెడ్యూల్ కులాల ఫైనాన్స్ కార్పొరేషన్ సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధులు మంజూరు చేసి, మెరుగైన ఉపాధి కల్పించాలని కోరారు. ఇంత వరకు సంస్థ చేపట్టిన వివరాలను ఆమె తెలుసుకున్నారు.

భాషా వలంటీర్లను రెన్యూవల్ చేయాలి



పాడేరు ఐటీడీఏ ఎదుట దీక్షలు చేస్తున్న మాతృభాష వలంటీర్లు

పాడేరు రూరల్ : జిల్లాల్లో పనిచేస్తున్న ఆదివాసీ మాతృభాష వలంటీర్ల రెన్యూవల్ చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాడేరు ఐటీడీఏ ఎదుట మాతృభాష విద్యా వలంటీర్లు 72 గంటల దీక్షలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో సుమారు 721 మంది భాష వలంటీర్లు కొండ, కువి, ఒరియా భాషల్లో బోధన చేస్తున్నారన్నారు. గిరిజన విద్యాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్‌లో కొంత మేర భాష వలంటీర్లకు కేటాయించాలని కోరారు. ఆదివాసీ మాతృభాష వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను, జిల్లా అధ్యక్షులు కుమారి, జిల్లా కార్యదర్శి నరభ నాయుడు, నాయకులు చిట్టిబాబు, గణేష్, కొండయ్య, వీరయ్య, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

ముంచంగిపుట్టు: మన్యంలో గత కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో సాగునీటికి ఇబ్బంది లేని పరిస్థితి ఉంది. వాణిజ్య పంటలతో పాటు కూరగాయాలు, ఆకుకూరల పంటలను విస్తారంగా పండిస్తున్నారు. అరకు నియోజకవర్గంలోని డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల తరువాత ఎక్కువగ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసే ప్రాంతంగా ముంచంగిపుట్టుకు పేరొంది. క్యారెట్, క్యాబేజీ, బంగాళదుంప, క్యాలీఫ్లవర్ తదితర పంటలు ఎక్కువగా పండిస్తున్నారు. ముంచంగిపుట్టు మండలం దొడిపుట్టు పంచాయతీలో 38 ఎకరాల్లో క్యాబేజీ, 42 ఎకరాల్లో బంగాళదుంప, క్యారెట్-26 ఎకరాల్లో, వంగ- 33 ఎకరాల్లో

ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో)

టమాటా	రూ.80
బంగాళదుంపలు	రూ.60
పచ్చిమిర్చి	రూ.70
వంకాయలు	రూ.40
బీన్స్	రూ.80
క్యారెట్	రూ.90
క్యాబేజీ	రూ.80
బీరకాయలు	రూ.60



వనభసింగిలో సాగులో ఉన్న క్యాబేజీ

పండిస్తున్నారు. దర్రెల పంచాయతీ పేటమాలిపుట్టులో క్యాబేజీ-28 ఎకరాల్ల, బంగాళదుంప-28 ఎకరాల్లో, వనభసింగి పంచాయతీలో క్యాబేజీ-22 ఎకరాల్లో, పచ్చిమిర్చి-16 ఎకరాల్లో గిరిజన రైతులు పండిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో పంటలు చేతికందే దశకు చేరుకున్నాయి. ఏజెన్సీలో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో మైదాన ప్రాంతా వ్యాపారులు మండలంలోని వారపు సంతలు, గిరిజన రైతుల వద్దకు వచ్చి కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం ధరలు బాగున్నాయని, రానున్న కార్తీక మాసంలో మరింత పెరిగే అవకాశా లున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదానంతో వంజంగి హిల్స్ రోడ్డు పనులు

పాడేరు రూరల్ : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వంజంగి కొండకు వెళ్లే మట్టి రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారడంతో కల్లాలబయలు గ్రామానికి చెందిన గిరిజనులు మంగళవారం శ్రమదానంతో బాగు చేసుకున్నారు. కల్లాలబయలు గ్రామానికి చెందిన గిరిజనులు మండల కేంద్రానికి వచ్చేందుకు ఇదే ప్రధాన దారి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై ఉన్న మట్టి మొత్తం కొట్టుకుపోయి పెద్ద, పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనం సైతం వెళ్లేందుకు అవకాశం లేదు. దీంతో గ్రామస్తులంతా ఏకమై మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర శ్రమదానం చేపట్టి గోతులను పూడ్చి రోడ్డును బాగుచేసుకున్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు, రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు.



శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకుంటున్న కల్లాలబయలు గిరిజనులు

యాజమాన్య పద్ధతుల సాగుపై అవగాహన



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వివిధ రకాల పంటల్లో యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ గణపతి, సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు గిరిజన రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. పంట చేనులో నీరు నిల్వ ఉండడం వలన ఆశించే తెగుళ్లు వాటి నివారణ చర్యల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంటల దశలను బట్టి నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని, తెగుళ్లు ఆశించిన రైతులు తమను సంప్రదిస్తే తగిన సూచనలు అందిస్తామని వారు చెప్పారు.

షూటింగ్‌లకు తాండవ అనుకూలం

నాతవరం: తాండవ రిజర్వాయర్‌పై రానున్న రోజుల్లో మరిన్ని సినిమా షూటింగ్‌లు జరిగే అవకాశాలున్నాయని డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్, సినీ నటుడు లోకవరపు జోగినాయుడు అన్నారు. ఏజెన్సీ పేరుతో నిర్మిస్తున్న చిత్ర దృశ్యాలను ఇక్కడ ప్రాజెక్ట్ వద్ద మంగళవారం చిత్రీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత అనకాపల్లి జిల్లా తాండవ రిజర్వాయర్ పరిసరాల్లో సినిమా షూటింగ్‌లు నిర్వహించుకునేందుకు అనువైన ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో షూటింగ్‌ల కోసం పలువురు చిత్ర దర్శకులు సందర్శించారన్నారు.



షూటింగ్ లొకేషన్‌లో నటుడు జోగినాయుడు, దర్శకుడు శ్రీనివాస్

రంగురాళ్ల తవ్వకాలు చేపడితే చర్యలు

జి.మాడుగుల: అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు చేపడితే పోలీస్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేడుతామని తహసీల్దార్ కె.అప్పలస్వామి, ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలో శివారు ప్రాంతం కూటికుండలులో ఇటీవల రంగురాళ్ల తవ్వకాలు జరిగిన స్థలాన్ని వారు మంగళవారం పరిశీలించారు. అనంతరం వనమామిడి, నిట్టాపుట్టు, నెయ్యలబంద, జర్రాయి, బొడ్డపుట్టు, సీతబంద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అక్రమ రంగురాళ్ల తవ్వకాలు చట్టరీత్యానేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని వారు హెచ్చరించారు. రంగురాళ్ల పేరుతో అడివిని, ప్రకృతిని నాశనం చేయవద్దని, పర్యావరణం దెబ్బతింటుందన్నారు. రంగురాళ్ల అన్వేషణ కోసం తవ్విన గోతులు ప్రమాదకరంగా మారుతాయని, గోతుల చరియలు విరిగిపడి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారుల ప్రలోభాలుతో రంగురాళ్ల తవ్వకాలు చేపట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని చెప్పారు. నియమ నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.



కూటికుండలు వద్ద రంగురాళ్ల తవ్వకాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి, ఎస్ఐ శ్రీనివాస్

ఘనంగా దారాలమ్మ జాతర



పొల్లూరు సమీపంలోని దారాలమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు



అమ్మవారికి బహూకరించిన వెండి కిరీటం

మోతుగూడెం: పొల్లూరు, మోతుగూడెం, పొల్లూరు గ్రామాల ఆరాధ్య దైవం దారాలమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా దసరా తరువాత వచ్చే మంగళవారం దారాలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. పండుగా సందర్భంగా సుమారు ఐదు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొండలరావు కుటుంబ సభ్యులు రూ.2 లక్షల విలువైన వెండి కిరీటాన్ని దారాలమ్మ అమ్మవారికి బహూకరించారు.

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు

- డీఎంహెచ్‌వో హేమంత్ ఆదేశం
- కింతలి పీహెచ్‌సీ తనిఖీ



కింతలి పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

మాడుగుల రూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు చికిత్సలు నిర్వహించి ప్రసవాలు చెయ్యాలని అనకాపల్లి జిల్లా డీఎంహెచ్‌వో కె. హేమంత్ ఆదేశించారు. మంగళవారం ఆయన కింతలి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో గదులు, పరిసరాలను ఆయన పరిశీలించారు. కోవిడ్ డోసు శతశాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. అంతేకాకుండా గర్భిణులకు తనిఖీలు, వ్యాధి నిరోధక టీకాలు శతశాతం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు కె.మాలం నాయుడు, నాగదివ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు ప్రసాద్, హెచ్‌వీ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు సహకరించాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ ఆనంద్ తదితరులు



ఇంజరిలో గిరిజనులకు సిల్వర్‌ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: గంజాయి నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలని ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ కోరారు. మండలంలోని మారుమూల ఇంజిరి పంచాయతీ కేంద్రంతో పాటు ననుబారి, కోంద్రుం, జుమదంగి, తల్లాబు, గిన్నెగరువు, మూలలోవ, తగ్గుపాడు, అంబేరిపాడు గ్రామాల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా జిల్ల ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు 10వేల సిల్వర్ ఓక్ మొక్కలను గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గిరిజనులు గంజాయికు దూరంగా ఉండి, వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. సిల్వర్‌ఓక్‌తో పాటు ఇతర పంటలను ప్రోత్సహించాలనే సంకల్పంతో మొక్కలను సైతం పోలీసుశాఖ అందిస్తోందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత విద్య, ఉపాధిపై దృష్టి సారించాలని, పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హార్టీకల్చర్ అధికారి శివకృష్ణ, సచివాలయ సిబ్బంది, పోలీసులు, గిరిజన రైతులున్నారు.

సారా, గంజాయికి దూరంగా ఉండాలి

గంగవరం: నెల్లిపూడి గ్రామంలో ఎస్ఈబీ సీఐ ఎ.ఆనంద్ ఆధ్వర్యంలో మంగళవారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సారా, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సారా బట్టీలు నిర్వహించినా, సారా విక్రయించినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సారా, గంజాయికి గిరిజనులు దూరంగా ఉండాలని సూచించారు. సారా, గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎస్ఈబీ శాఖ పనిచేస్తోందన్నారు. సారా విక్రయాలు, రవాణాపై గ్రామస్తులు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సారా కేసుల్లో పట్టుబడ్డ ముగ్గురిపై బైండొవర్ కేసులు నమోదు చేసి గంగవరం తహసీల్దార్ శ్రీమన్నారాయణ వద్ద హాజరుపరిచారు. ఎస్ఈబీ ఎస్ఐ ఫణింద్రకుమార్, సిబ్బంది సత్యనారాయణ, రమణ తదితరులున్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు చోడవరం విద్యార్థి

- రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సొంతం

చోడవరం: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో చోడవరం విద్యార్థి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రం నుంచి పొట్నూరు పవన్‌కుమార్ పాల్గొన్నాడు. అండర్ - 14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. నవంబరులో బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని పతంజలి యోగా కేంద్రం గురువు పుల్లేటి సతీష్, కమిటీ ప్రతినిధులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన యామల శేఖర్(26), లాలం కృష్ణ(25) సోమవారం అర్ధరాత్రి మాకవరపాలెం నుంచి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం బయలుదేరారు. అయితే కొండలఅగ్రహారం వద్ద సర్పానది వంతెన వద్దకు వెళ్లే సరికి అదుపు తప్పి వంతెనను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో శేఖర్ స్వల్పంగా గాయపడగా, కృష్ణకు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కృష్ణను విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

కూలిన పెంకుటిల్లు పైకప్పు

- నిరాశ్రయులైన వృద్ధ దంపతులు



కూలిపోయిన పెంకుటిల్లు వద్ద వృద్ధ దంపతులు పాపారావు, మహాలక్ష్మి

చోడవరం: తుపాను వర్షాలకు అంకుపాలెం శివారు గోవిందమ్మ కాలనీలో పెంకుటిల్లు మంగళవారం కూలిపోయింది. భారీ వర్షాలకు లోతట్టుప్రాంతంలో ఉన్న గోవిందమ్మ కాలనీ చాలా మేర మునిగిపోయింది. దీంతో చాలా పెంకుటిళ్లు నానిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో నాగులాపల్లి పాపారావుకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. వృద్ధాప్యంలో ఉన్న పాపారావు, భార్య మహాలక్ష్మి పెంకుటిల్లులో నివసిస్తున్నారు. రోజువారీ కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నారు. వర్షాలకు కూలిపని కూడా సరిగ్గా లేకపోవడంతో చాలా ఇబ్బందులతో ఉన్నారు. ఈ సమయంలో పెంకుటిళ్లు కూడా కూలిపోవడంతో ఆ వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. ఇల్లు కూలిపోయిన సమయంలో వారిద్దరూ ఆరుబయట ఉన్నందున పెద్ద ప్రమాదం తప్పింది. పైకప్పు కూలడంతో ఇంట్లో ఉన్న వంట సామగ్రి ధ్వంసమయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి ఆదుకోవాలని వృద్ధ దంపతులు పాపారావు, మహాలక్ష్మి కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

చింతపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తుండడంతో ప్రజలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని ఆమె స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి ప్రజా సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పార్టీ శ్రేణులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, అవగాహన కల్పించాలని కోరారు. జి.మాడుగుల మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, చింతపల్లి మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పర్యటన
- పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో గడప గడపకు విశేష ఆదరణ

గూడెంకొత్తవీధి : మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మునుపెన్నడు లేని విధంగా మండలంలోని కుంకుంపూడి గ్రామంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మంగళవారం పర్యటించారు. కుంకుంపూడి, వాడమామిడి, అగ్రహారం, పెదపాడు, పెద అగ్రహారం గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని 270 గడపలను ఆమె సందర్శించారు. విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్డు తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో అన్ని వర్గాలకు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియజేసి, మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ఆదరించాలని గిరిజనులను కోరారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచులు రామకృష్ణ, సుభద్ర, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, కాసులమ్మ, జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, పీఆర్ జేఇ జ్యోతిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భగవంతరావు, ఎంఈవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ పాపారావు, కో–ఆప్షన్ సభ్యులు ఎస్కే మజీద్, దావూద్, నాయకులు అరుణ్, ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



కుంకుంపూడి గ్రామంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



సీకరిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రాచపాలెంలో గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

దేశంలోనే మెరుగైన ప్రజాపాలన: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: దేశంలోనే మెరుగైన ప్రజా పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని సీకరి పంచాయతీ కేంద్రంతో పాటు పన్నెడ, బొడ్డపుట్టు, వెల్లపాలెం గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 395 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణకు ఘన స్వాగతం పలికారు. సక్రమంగా, సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన, చేపడతున్న అభివృద్ధి పనులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల యోగక్షేమాలు, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, ఎంపీటీసీ సభ్యుడు ఆనందరావు, సర్పంచ్ కృష్ణారావు, ఎంఈవో సింహాచలం, ఈవోపీఆర్డీ నర్సింగరావు, మండల ఇంజినీరింగ్ అధికారి సంజీవరావు, సీడీపీవో రాజ్యలక్ష్మి, నాయకులు బాలంనాయుడు, కనకరాజు, సూరయ్య, సూర్యనారాయణ, సింహాచలం, సుబ్బారావు, సన్యాసిదొర తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: పనసలపాలెం గ్రామ సచివాలయం పరిధిలోని రాచపాలెం, పనసలపాలెం, అద్దరివీధి, బూరుగువాడ, మువ్వలవాడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ప్రజాదారణ లభించింది. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆయా గ్రామాల్లో సుమారు 500పైగా గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సమస్యలను తెలుసుకొని, తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన కులధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, సర్పంచ్ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిమూర్తులు,తమ్మిరెడ్డి, భారతిబాబు, మడి బాబి, విజయ్‌కుమార్, కనకరాజు, నూకరాజు, తిరుపతిరెడ్డి, నారాయణావు, సర్పంచ్‌లు, తహసీల్దార్ సుధాకర్, ఏపీవో ప్రకాష్‌బాబు, కార్యదర్శి మధుసూదనరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అండగా ప్రభుత్వం



విత్తనాలు అందజేస్తున్న ఎంపీటీసీ

ఎటపాక: మండలంలోని నెల్లిపాక గ్రామంలోని ఆర్‌బీకేలో ప్రభుత్వం అందించిన విత్తనాలను ఎంపీటీసీ సభ్యురాలు అంజలి మంగళవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రంపచోడవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ముసురుమిల్లి సర్పంచ్ రమేష్‌బాబుదొర, ఎంపీటీసీ వంశీ అన్నారు. ముసుమిల్లి పంచాయతీ పెద్దబారంగి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పని కల్పిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో తాగునీరు, వీధిలైట్ల సమస్యలను గ్రామ సచివాలయ సిబ్బంది పరిష్కరించాలన్నారు. ఎంపీడీవో కుమార్‌బాబు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. ఏపీవో సాయిబాబా, ఉప సర్పంచ్ ప్రభురెడ్డి, వార్డు సభ్యులు సత్యనారాయణ, సరస్వతి, రాజన్నదొర, గుడి చైర్మన్ శేఖర్, రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు.

విశాఖ గర్జనను విజయవంతం చేయాలి



ఎంపీపీ అనూషా దేవి

చింతపల్లిరూరల్: విశాఖలో ఈనెల 15న నిర్వహించనున్న విశాఖ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి కోరారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మూడు రాజధానులతో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా చేపడుతున్న కార్యక్రమానికి గిరిజనులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ



అంగన్‌వాడి కేంద్రంలో విచారణ చేస్తున్న సీడీపీవో విమల

ఎటపాక: గన్నేరుకొయ్యపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో విమల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం పరిధిలోని పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరగడం లేదని అందిన ఫిర్యాదుపై ఆమె విచారణ చేశారు. గోదావరి వరదల సమయంలో కేంద్రం భవనం ముంపునకు గురికావడంతో కేంద్రం వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, ఈ కారణంగా కేంద్రం వద్ద పౌష్టికాహారాన్ని ఇవ్వకుండా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నట్టు కార్యకర్త వివరణ ఇచ్చారు. అయితే కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ప్రతీ రోజు కేంద్రం తెరచి ఫీడింగ్ సక్రమంగా ఇవ్వాలని సీడీపీవో హెచ్చరించారు.

చిన్నారి వైద్యానికి సాయం



చిన్నారి పూర్ణ ఆకాష్ కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్థానికులు

రాజవొమ్మంగి: గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న బాలుడు పూర్ణఆకాష్‌కు చికిత్స నిమిత్తం స్థానికులు కొంతమంది సేకరించిన రూ. 11,500 విరాళాన్ని మంగళవారం అందజేశారు. పూర్ణ ఆకాష్ ఆపరేషన్ నిమిత్తం రూ.లక్షల్లో సొమ్ము అవసరమున్నట్టు తెలుసుకున్న స్థానికులు, చిన్నారి తల్లిదండ్రులు రాధ, శ్రీనులను కలిసి మనో ధైర్యం కల్పించి, నగదును అందజేశారు. విద్యుత్‌నగర్ పరిసర వాసులు వెంకట్రావ్ చౌదరి, రామరాజు, రాఘవులు, శ్రీనివాస్, నూకరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



గూడెంకొత్తవీధి : మండలంలోని ఆర్.వి.నగర్ నుంచి కోరాపల్లికి వెళ్లే మార్గమధ్యలో ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కొండచిలువను స్థానికులు గుర్తించి మంగళవారం హతం చేశారు. ఆ మార్గంలో వెళ్తున్న గిరిజనులకు పది అడుగుల మేర ఉన్న కొండ చిలువ ఎదురు పడడంతో ఆందోళనకు గురయ్యారు. పెద్ద కర్రల సాయంతో హతం చేశారు.

జాబ్‌కార్డుదారులకు పూర్తిస్థాయిలో పనులు



సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ భాగ్యారావు

రాజవొమ్మంగి: పనుల్లోకి వచ్చే ఉపాధి వేతనదారుల సంఖ్య మరింత పెంచాలని ఉపాధి ఏపీడీ కె.భాగ్యారావు సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పని దినాలు 80 రోజులు వరకు చేసిన వారిని వందరోజులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా రోజుకు 5వేల మంది ఉపాధి పనులకు హాజరుకావాలన్నది లక్ష్యం కాగా 2,056 మంది వస్తున్నారని సిబ్బంది తెలపడంతో ఈ సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరు పనుల్లోకి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం కేటిల్ పాండ్స్, ల్యాండ్‌లెవెలింగ్, చెరువుగట్లు, పంటకాలువ గట్లపై, రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ తదితర పనులు జరుగుతున్నట్టు సిబ్బంది ఏపీడీకు వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనుల ఫొటోలను ఉదయం ఒకటి, మధ్యాహ్నం ఒకటి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని మేట్‌లను ఆదేశించారు. పనుల రికార్డులు సమగ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎఫ్ఏలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



సిబ్బందితో మాట్లాడుతున్న రంపచోడవరం ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కల్పన



గుర్తేడు పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రంపచోడవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో సుమారు 170 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ కల్పన మాట్లాడుతూ ఉద్యోగులు విధిగా బయోమెట్రిక్ ఉపయోగించి హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. రోగులకు సకాలంలో మంచి వైద్య సేవలు అందించాలన్నారు.ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రతీ ఒక్క వైద్యుడు కష్టపడి పనిచేయలన్నారు.

మారేడుమిల్లి: గుర్తేడు పీహెచ్‌సీలో డాక్టర్ సత్యతేజ్ ఆధ్వర్యంలో మంగళవారం గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డాక్టర్ లిఖిత సుమారు 85 మంది గర్భిణులకు స్కానింగ్, రక్త పరీక్షలు చేసి, మందులు అందజేశారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోష్టకాహారం గురించి గర్భిణులకు వివరించారు. ఎంపీహెచ్‌వో లక్ష్మణరావు, హెచ్‌వీలు కృష్ణవేణి, సర్వంతభాయి, ఏఎన్ఎంలు సత్యవేణి, వీరాయమ్మ, సుబ్బలక్ష్మి, తదితరులున్నారు.

నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

అడ్డతీగల: మండల మహిళా సమాఖ్య పక్షోత్సవాల్లో భాగంగా అడ్డతీగలలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం రంపచోడవరం ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంఘాల ఏర్పాటు వాటి నిర్దేశిత లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. రుణాల రికవరీ పాటించాలని, సభ్యుల జీవనోపాధుల మెరుగుదలకు చర్యకు తీసుకోవాలన్నారు. అన్ని సంఘాలు ఏ గ్రేడులో నిలవాలన్నారు. దివ్యాంగులను గుర్తించి వారిని సంఘాలుగా ఏర్పాటు చేయాలని, ప్రధానంగా సంఘాల నిర్వహణ కోసం అందుబాటులో ఉన్న పుస్తకాల నిర్వహణ జరగాలనిసూచించారు. పొదుపు ,సంఘాల నిర్వహణ, ఆర్థిక బలోపేతం కోసం లక్ష్యాలను నిర్దేశించుకుని సంఘాలు ముందుకు వెళ్లాలన్నారు. ఏపీఎం దుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు పెంచాలి



ర్యాలీ చేస్తున్న ఏపీవీవీయూ సభ్యులు

జి.మాడుగుల: వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు పెంచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ (ఏపీవీవీయూ) ముమ్మర ప్రచారం చేస్తోందని జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పారు. వ్యవసాయ కూలీలకు దినసరి వేతనం రూ.850 చెల్లించాలని, ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత జాబు కార్డులు మంజూరు చేసి 200రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. రాజబాబు, చిన్నారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలుచేయాలి

రంపచోడవరం: రంపచోడవరం మండల సీఐటీయూ సభ మంగళవారం కొమరం చెల్లాయమ్మ అధ్యక్షతన జరిగింది. జిల్లా నాయకులు వాణిశ్రీ, గిరిజన సంఘం నాయకులు సిరిమల్లిరెడ్డి, శ్రీనివాస్ హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనాల అమలుకు సీఐటీయూ చేయనున్న పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఓటరు నమోదు చేయించాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ముంచంగిపుట్టు/పాడేరు రూరల్: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులను గుర్తించి, ఓటర్లుగా నమోదు చేయించాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మత్స్యరాజు ,వేమనబాబు, రత్నారావు తదితరులు పాల్గొన్నారు. పాడేరులోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. దేశ వారసత్వ సంపదగా ఉజ్జయిని ఆలయాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ చెప్పారు. రామయ్య, పాత్రుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



చిట్టమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: కిలగాడలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మధు తల్లి చిట్టపులి చిట్టమ్మ (71) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం గ్రామానికి వెళ్లి చిట్టమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల వైఎస్సార్‌సీపీ నేతలు చిట్టమ్మకు నివాళులర్పించారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే ధనలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు

రాజవొమ్మంగి: కన్నయమ్మపేటలోని కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయాలని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి విన్నవించారు. ఎల్లవరంలోని ఎమ్మెల్యే ధనలక్ష్మిను వారు మంగళవారం కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో మండల అధ్యక్షుడు లింగేశ్వరరావు, క్యాదర్శి శ్రీనివాస్ సభ్యులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

దుంబ్రిగుడ: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బాక ఈశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నగేష్ తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి

దుంబ్రిగుడ: అరకు సంతబయలు సమీపంలో గల అరకు–పాడేరు ప్రధాన రహదారిలో ఓ గిరిజనేతరుడు అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ సురేష్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనేతరులు భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు ఎక్కువయ్యాయని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పార్టీ తరఫున ఆందోళన చేస్తామన్నారు.

ఘనంగా ప్రపంచ బాలికల దినోత్సవం



పెదగరువు పాఠశాలలో ర్యాలీ చేస్తున్న బాలికలు



గంగవరంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ మండలశాఖ మహిళా అధ్యక్షురాలు రుక్మిణిదేవి

హుకుంపేట: పెదగరువు ప్రభుత్వ బాలికల పాఠశాల, మండల కేంద్రంలో ఇంగ్లిష్ మీడియం బాలికల పాఠశాలలో మానవ హక్కుల క్లబ్(హెచ్‌ఆర్‌సీ) జిల్లా కో–ఆర్డినేటర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రపంచ బాలికల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతు బాలికల హక్కుల గురించి అవగాహన కల్పించారు. మఠం పంచాయితీ దూరువీధి ఆశ్రమ పాఠశాలలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బాలుకలకు హక్కులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం కొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండలశాఖ మహిళా అధ్యక్షురాలు ఎల్.రుక్మిణీదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు. కొత్తాడ కేజీబీవీ, వేములోవ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలల్లో కూడా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

140 పశువులకు టీకాలు



తలిబిరడాలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు దొడిపుట్టు పంచాయతీ తలబిరడా గ్రామాల్లో పశువైద్యాధికారి భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు.140 పశువులకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. లంపి స్కిన్ వ్యాధి, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం, యాజమాన్య పద్ధతులపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.1962 పశు సంచార వాహనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సిబ్బంది అనురాధ, రాజు, బుచ్చిరాజు, వెంకట్‌రాజు, బుద్ధు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



పవనగిరి క్షేత్రంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

అడ్డతీగల: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పవనగిరి క్షేత్రంలో వేంచేసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి అష్టోత్తర, నిరాజన మంత్రపుష్పాలతో పూజలు నిర్వహించారు. క్షేత్రంలో కొలువైన నవగ్రహాల్లో శ్రీ కుజగ్రహ విగ్రహమూర్తికి అష్టోత్తర పూజ చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. పూతిగుంట, చీడిపాలెం, జడేరు గ్రామాలతో పాటు పలుచోట్ల నుంచి భక్తులు వచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగునా!



నిరుపయోగంగా ఉన్న పెద్ద ఆస్పత్రి భవనం

కొయ్యూరు: కొత్త భవనాల నిర్మాణంతో పాత భవనాల వినియోగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రాజేంద్రపాలెం ఆస్పత్రిలో రెండు పాత భవనాలు వినియోగించడం లేదు. రాజేంద్రపాలెంలో 1970లో పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. తరువాత 1983లో మరో పెద్ద భవనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం 2016లో కొత్త భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి కొత్త భవనంలో ఆస్పత్రి కొనసాగుతోంది. దీంతోపాటు గర్భిణుల సంరక్షణ కేంద్రాన్ని 2015లో నిర్మించారు. దీనిలో ప్రస్తుతానికి ప్రసవాలు చేస్తున్నారు. గతంలో కొయ్యూరు మండల కేంద్రంలో జాతీయ బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదించారు. బ్యాంకు కోసం ఆస్పత్రి పాత భవనాన్ని కేటాయించేందుకు నిర్ణయించారు. అయితే కొత్త బ్యాంకుల ఏర్పాటుకు ఆర్‌బీఐ నుంచి అనుమతి రాకపోవడంతో ఆ ప్రతిపాదన మూలకు చేరింది. ప్రస్తుతం పాత భవనం నిరుపయోగంగా మారిందని, పూర్తిగా పాడైపోతోందని, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సర్పంచ్ సీతయ్యకు పరామర్శ



సర్పంచ్ సీతయ్యను పరామర్శిస్తున్న నేతలు

అనంతగిరి: కొత్తూరు పంచాయతీ సర్పంచ్ సారా సీతయ్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ, సర్పంచ్‌లు అప్పారావు, సన్యాసిరావు తదితరులు సీతయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు మధుసూదన్, సుబ్బారావు, పోలయ్య, విశ్వనాథం, గంగరాజు, అప్పలరాజు, రాజేష్, సింగప్ప తదితరులున్నారు.

ఘనంగా అన్నసమారాధన

మారేడుమిల్లి : దసరా ఉత్సవాలు పురస్కరించుకొని స్థానిక సోమిరెడ్డిపాలెం వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 800 మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.